
# మనం
## హైదరాబాద్
రంగారెడ్డి | మేడ్చల్

శుక్రవారం | 4 | ఏప్రిల్ | 2025 పేజీలు: 9



## ఊడిన పెచ్చులు

చార్మినార్, మనం న్యూస్: అకాల వర్షంతో చార్మినార్ పెచ్చులు ఊడిపడ్డాయి. గురువారం మధ్యాహ్నం వాన దంచికొట్టిన సందర్భంలో చార్మినార్ నుంచి పెచ్చులు ఊడిపడటం జరిగింది. భాగ్యలక్ష్మి ఆలయం వైపు ఉన్న మినార్ నుంచి పెచ్చులు ఒక్కసారిగా కిందపడ్డాయి. దీంతో తీవ్ర భయాందోళనకు గురైన పర్యాటకులు అక్కడ్నుంచి పరుగులు పెట్టారు. గతంలో రిపేర్ చేసిన మినార్ నుంచి పెచ్చులు ఊడిపడినట్లు నిర్ధారణ అయ్యింది. సమాచారం అందుకున్న అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

## హెచ్‌సీయూలో సంబురాలు



2

## ఓయూలో అరెస్టులు



2

# అంతా సస్పెన్స్?





### అంతా సక్రమం
**-నిషిజ ఇన్‌ఫ్రా ఎల్‌ఎల్‌పీ డిజిగ్నేటెడ్ పాట్నర్ పర్వతనేని గంగాధరరావు**

ప్రభుత్వ నియమ, నిబంధనల ప్రకారం ఘట్‌కేసర్ భూముల బదలాయింపు జరిగింది. భూమి పుత్రులకు నిబంధనల ప్రకారం హక్కులు దక్కాయి. వారి నుంచి భూములు కొనుగోలు చేసిన వారితో కలిసి వెంచర్ రూపొందించేందుకు ఒప్పందం కుదుర్చుకోవడం జరిగిందని నిషిజ ఇన్‌ఫ్రా ఎల్‌ఎల్‌పీ డిజిగ్నేనెటెడ్ డైరెక్టర్ పర్వతనేని గంగాధరరావు తెలిపారు. ప్రభుత్వ భూమి విషయంలో రెవెన్యూ అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉన్నదని.. తమకు చెందిన భూమిలోనే మూడు ఎకరాల 27 గుంటల భూమి తక్కువగా ఉన్నదని.. తక్కువైన భూమి గురించి సర్వే చేపట్టాలని కోరుతున్నా.. రెవెన్యూ అధికారులు దాటవేస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బ్లాస్టింగ్‌ల విషయంలో నిబంధనలు పాటిస్తున్నామని... అయితే స్థానికులకు జరిగిన కొంత మేరకు నష్టం చెల్లింపు విషయంలో పనులు జరుగుతున్నందున ఒకింత జాప్యం జరుగుతోందని.. పనులు పూర్తయిన వెంటనే వారికి త్వరలోనే పరిహారం అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని హామీ ఇచ్చారు. భూముల బదలాయింపు విషయంలో స్పష్టత ఉన్నదని.. భూములకు సంబంధించిన అన్ని లింక్ డాక్యుమెంట్లను అందించేందుకు సిద్ధంగా ఉన్నామని పర్వతనేని గంగాధరరావు తెలిపారు.

- 1967కి ముందు సర్వే నెం 543లోని భూమి సర్కారుదే
- నయీమున్నీసాబేగం ఎలా భూ హక్కుదారు అయ్యారు?
- 30 ఏండ్ల తరువాత 38ఏ కింద విక్రయాలు
- కొనుగోలుదారులతో నిషిజ ఇన్‌ఫ్రా వ్యాపార ఒప్పందం
- నోటీసులు జారీ చేశామంటున్న ఘట్‌కేసర్ ఎంఆర్‌ఓ
- అంతా సక్రమం అంటున్న నిషిజ ఇన్‌ఫ్రా డిజిగ్నేటెడ్ పాట్నర్
- టెనెంట్ యాక్ట్ పేరిట ప్రభుత్వ భూములు నొక్కేశారని అభియోగం
- బడా నేతల ఒత్తిడితోనే ఘట్‌కేసర్ భూములపై చర్యలు లేవని విమర్శలు
- రాజకీయ నేతలు.. అధికారుల చేతివాటంతోనే అక్రమం సక్రమం అయ్యిందా?
- జవహర్‌నగర్‌లో కలెక్టర్ పర్యటన.. ఘట్‌కేసర్‌లో భూములు పట్టించుకోరా?

2

### నోటీసులు ఇచ్చాం
**-ఘట్‌కేసర్ ఎంఆర్‌ఓ రజిని**

నిషిజ ఇన్‌ఫ్రా లిమిటెడ్ లియబిలిటీ పార్టనర్‌షిప్ సంస్థకు నోటీసులు ఇచ్చామని ఘట్‌కేసర్ ఎంఆర్‌ఓ రజిని తెలిపారు. నిషిజ ఇన్‌ఫ్రా వెంచర్ విషయంలో నెలకొన్న భూ వివాదంపై స్పష్టత ఇవ్వాలని కోరుతూ వారి దగ్గర ఎలాంటి డాక్యుమెంట్స్ ఉన్నాయి? అనే విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత ముందుకు వెళ్లేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. రెండు మూడు రోజుల్లో లిఖితపూర్వకంగా డాక్యుమెంట్స్ సబ్మిట్ చేయవలసిందిగా నోటీసు రాతపూర్వకంగా ఇచ్చామన్నారు. ఏదైనా రైటింగ్‌లోనే ఇస్తే రైటింగ్‌లో సమాధానం ఇస్తారని అన్నారు. పూర్తిగా సర్వే చేయకుండా పై అధికారులకు వివరాలు తెలపలేమన్నారు. వారు సబ్మిట్ చేసిన డాక్యుమెంట్స్ మీద వారి స్థలం నిర్ణయించడం జరుగుతుందని.. దాని తర్వాత సర్వేకు మా సిబ్బందిని పంపిస్తామని వివరించారు. వెంచర్ నిర్వాహకులు డాక్యుమెంట్ ఇస్తేనే వారి భూమి ఎంత? ప్రభుత్వ భూమి ఎంత? అనేది నిర్ధారించేందుకు వీలుంటుందన్నారు.

*'సర్వే నెం 543లో ఉన్న 226 ఎకరాల భూమి మొత్తం కూడా సర్కారు భూమి. 1967 నుంచి నయీమున్నీసా బేగం పేరిట 226 ఎకరాల భూమి నమోదయ్యింది. ఈ భూమిని సేత్‌వార్ కింద ఘట్‌కేసర్ ప్రాంతంలో నివాసముంటున్న 15 మంది యాదవ సామాజికవర్గానికి చెందిన వారికి సర్వే నెం 543 నుంచి 19 వరకు బై నెంబర్లు కేటాయిస్తూ 180 ఎకరాలను 1982లో మ్యుటేషన్ చేయడం జరిగింది. అలా భూములు దక్కించుకున్న వారు 2016లో 38ఈ కింద భూములను విక్రయించినట్లు సమాచారం. మిగతా సర్కారు భూమిగా పేర్కొనడం జరిగింది. ఇనేళ్ల వ్యవహారంలో అసలు ప్రభుత్వ భూమి ప్రైవేట్ భూమిగా ఎలా మారింది? అనేది సస్పెన్స్'.*

## జోరు వాన





2

## డ్రైవ్ సక్సెస్

-పూర్తయిన జలమండలి 180 రోజుల డ్రైవ్

-3,185 కిలోమీటర్ల సీవరేజ్ లైన్ పనులు

-2.50 లక్షల మ్యాన్‌హోళ్లలో డీ-సిల్టింగ్

-సమష్టి కృషి వల్లే మంచి ఫలితాలు: ఎండీ అశోక్‌రెడ్డి



3



# జోరు వాన

సిటీబ్యూరో, మనం న్యూస్: ఉదయం నుంచి మేఘావృతమై ఉండగా... మధ్యాహ్నం తరువాత వర్షం దంచికొట్టింది. వర్షం కారణంగా పలు ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ స్తంభించిపోయింది. అరగంట పాటు ఏకధాటిగా కురిసిన వర్షంతో రహదారుల్లో వాహనదారులు బారులుతీరారు. వర్షం కారణంగా రహదారుల్లో వరద పారింది. డ్రైనేజ్ పైప్‌లైన్లు పొంగిపొర్లడంతో దుర్గంధం వ్యాపించింది. వర్షం నీటి కాలువలపై చెత్త పేరుకుపోయవడంతో అక్కడక్కడా వర్షం నీరు రహదారులు, ఫుట్‌పాత్‌లపై నిలిచిపోయింది. ముఖ్యంగా పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈదురుగాలి జోరుగా వీచడంతో విద్యుత్ వైర్లకు అడ్డంకులు ఏర్పడటంతో పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా గంటల తరబడి నిలిచిపోయింది. దీంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. కుండపోత వర్షంతో లోతట్టు ప్రాంతాలతో పాటు రోడ్లన్నీ జలమయం అయ్యాయి. ప్రధాన రహదారి లక్డీకాపూల్, ఖైరతాబాద్ ప్రధాన రహదారిపై భారీగా వరద నీరు నిలిచిపోయింది. దీంతో ఖైరతాబాద్-పంజాగుట్ట మధ్య వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఖైరతాబాద్ నుంచి పంజాగుట్ట వైపు వెళ్లే వాహనాలను దారి మళ్లించారు. ట్రాఫిక్ పోలీసులు తాజ్ కృష్ణా వైపు వాహనాలను మళ్లించారు.. ఖైరతాబాద్‌లోని మెర్క్యూరి హోటల్ వద్ద కారుపై ఓ చెట్టు కూలింది. ఈ ప్రమాదం నుంచి ఇద్దరు మహిళలు సురక్షితంగా బయటపడ్డారు. ఇక రాజ్‌భవన్, సచివాలయం, అసెంబ్లీ, ట్యాంక్‌బండ్, నెక్లెస్‌రోడ్డు, సోమాజిగూడ, బేగంపేట్, అమీర్‌పేట్, పంజాగుట్ట, బషీర్‌బాగ్, కోఠి, అబిడ్స్, బేగంబజార్, అఫ్జల్‌గంజ్, మలక్‌పేట్, చాదర్‌ఘాట్, ముసారాంబాగ్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్.... ఇలా చాలా ప్రాంతాలలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కాగా ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్న వరుణుడు కరుణించాడు. వర్షం కురవడంతో గ్రేటర్‌తో పాటు శివార్లలో ఒక్కసారిగా కూల్ నెలకొంది.

# అంతా సస్పెన్స్?

గ్రేటర్ హైదరాబాద్ బ్యూరో, మనం న్యూస్: ప్రభుత్వ భూముల వ్యవహారంలో ఏకంగా సుప్రీంకోర్టు సైతం స్పందిస్తుంటే... మేడ్చల్ జిల్లాలో భూములపై వస్తున్న ఆరోపణల విషయంలో రెవెన్యూ అధికారులు ఎందుకు మౌనంగా ఉంటున్నారు? అనేది అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తున్నది. అసలు ఘట్‌కేసర్‌లోని గట్టుమైసమ్మ గుట్టకు చెందిన 220 ఎకరాల భూమి మొత్తం కూడా ప్రభుత్వ భూమని... టెనెంట్ యాక్ట్ పేరిట బురిడీ కొట్టించి రూ.వేల కోట్ల భూమిని పరాధీనం చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంలో నిషిజ ఇన్‌ఫ్రా ఎల్ఎల్‌పీ స్పందిస్తూ నిబంధనల ప్రకారం భూముల ఒప్పందం జరిగిందని... అంతా సక్రమంగానే ఉందని వివరణ ఇస్తుండగా... ఘట్‌కేసర్ ఎంఆర్‌ఓ స్పందిస్తూ వెంచర్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేశామని.. వారి నుంచి సమాధానం వచ్చిన తరువాత ప్రభుత్వ భూమి విషయంలో పరిశీలించి స్పందిస్తామని పేర్కొనడం జరిగింది. రూ.వందల కోట్ల విలువైన భూముల విషయంలో మేడ్చల్ జిల్లా రెవెన్యూ అధికారులు మీడియాలో కథనాలు వస్తేనే స్పందిస్తూ తూతూమంత్రంగా నోటీసులు జారీచేస్తున్నారు? ఎందుకు ఇలా చేస్తున్నారు? అనేది అనుమానాలకు తావిస్తున్నది. మేడ్చల్ కలెక్టర్ జవహర్‌నగర్‌లో పర్యటించి భూములను పరిశీలించినట్లు సమాచారం.. అయితే ఘట్‌కేసర్ భూముల విషయంలో ఎందుకు చొరవ చూపడం లేదు? అనేది అంతుచిక్కడం లేదు.

పేదలు ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుంటే తెల్లవారకముందే జేసీబీలతో వచ్చి కూల్చివేస్తారు. అదే బడాబాబులు ఆక్రమిస్తే నోటీసులు జారీ చేస్తూ తమాషా చూస్తారు.... ఇది



రెవెన్యూ శాఖ అధికారుల తీరు. ఈ క్రమంలోనే ఘట్‌కేసర్ గట్టుమైసమ్మ గుట్ట 226 ఎకరాల వ్యవహారంలో మొదటి నుంచి అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 226 ఎకరాల భూమి ప్రభుత్వ భూమిగా స్థానికులు పేర్కొంటున్నారు. అసలు ముస్లిం మహిళకు చెందిన భూమిగా చెబుతున్నా... ఆమెకు హక్కులు ఎలా వచ్చాయి? అనేది ఎవరూ చెప్పడం లేదు. హక్కుదారుల నుంచి 15 మంది టెనెంట్ యాక్ట్ ప్రకారం హక్కులు పొందారని వారి నుంచి కొందరు ఈ భూములను కొనుగోలు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయంలో గతంలోని పాలకులు, కలెక్టర్లు సైతం సహకరించారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 2016లో అప్పటి తహశీల్దార్ విష్ణువర్ధన్ సంబంధిత భూమి ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ కలెక్టర్‌కు నివేదిక సమర్పించినట్లు సమాచారం. 2017లో అప్పటి ఎమ్మెల్యే ఈ భూముల విషయంలో ఫిర్యాదు చేయడం జరిగింది. ఏమయ్యిందో ఏమో తరువాత గప్‌చుప్‌గా పరిస్థితి మారిపోయింది. రూ.కోట్ల విలువైన భూముల వ్యవహారంలో అటు రాజకీయ నేతలు.. ఇటు వివిధ శాఖలకు చెందిన అధికారులు ఎవరి వాటాలు వారు పంచుకున్నారని.. అందుకే మౌనం వహిస్తున్నారు? అనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. గడచిన రెండు దశాబ్దాల కాలంలో జరిగిన భూమాయతో రూ.కోట్ల విలువైన భూములు చేతులుమారాయని.. సమైఖ్యపాలకుల తరహాలోనే స్వరాష్ట్రంలోనూ భూమాయ జరిగిందని స్థానికులు మండిపడుతున్నారు. వెంచర్ వద్ద నిషిజ ఇన్‌ఫ్రా ఎల్ఎల్‌పీ నిర్వాహకులు రౌడీలను ఏర్పాటు చేసుకుని బెదిరింపులకు పాల్పడుతూ ఓ రాకుమారుడి ఆధ్వర్యంలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. అంతా సవ్యంగా ఉంటే రౌడీల కాపాలా ఎందుకు? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఏదేమైనా ప్రజాపాలనలోనూ సమైక్య పాలన తరహాలోనే భూమాయ జరుగుతోందని.. ఇక భూమి పుత్రులకు తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతో దక్కింది ఏమిటని ఆందోళన వ్యక్తమవుతోంది.

## హెచ్‌సీయూలో సంబురాలు



సెంట్రల్ వర్సిటీ, మనం న్యూస్: కంచ గచ్చిబౌలి భూముల విషయంలో రాష్ట్ర ప్రభుత్వ చర్యలు అన్నీ నిలిపివేయాలంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల పట్ల హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హెచ్‌సీయూలో విద్యార్థులు సంబురాలు నిర్వహించారు. సుప్రీంకోర్టు తీర్పుతోనైనా సీఎం రేవంత్‌రెడ్డి దుందుడుకు చర్యలు విరమించుకోవాలని విద్యార్థులు సూచించారు. జీవ వైవిధ్యాన్ని కాపాడుకునేందుకు పోరాటం కొనసాగిస్తామని తేల్చిచెప్పారు. హైకోర్టు రిజిస్ట్రార్ పంపిన మధ్యంతర నివేదికను సుప్రీంకోర్టు పరిశీలించింది. వార్తా కథనాలను జస్టిస్ గవాయ్ ముందు అమికస్ క్యూరీ మెన్షన్ చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ప్రతివాదిగా చేర్చింది కోర్టు. హైకోర్టు రిజిస్ట్రార్ నివేదిక ఫొటోలు చూస్తే పరిస్థితి అర్థమవుతుందన్నారు. వందల యంత్రాలు మోహరించాల్సిన అవసరమేంటని జస్టిస్ గవాయ్ ప్రశ్నించారు. అత్యవసరంగా కార్యకలాపాలు చేపట్టాల్సిన అవసరం ఏంటని ప్రశ్నించారు. ఇది చాలా తీవ్రమైన అంశం అని కోర్టు పేర్కొంది. 3 రోజుల్లో 100 ఎకరాల్లో చెట్లు కొట్టివేత చిన్న విషయం కాదని ధర్మాసనం అభిప్రాయపడింది. చెట్ల కొట్టివేతకు అనుమతి తీసుకున్నారా..? అని కోర్టు ప్రశ్నించింది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు ఒక్క చెట్టు కూడా నరికివేయొద్దని కోర్టు ఆదేశించింది. అఫిడవిట్ దాఖలు చేయాలని సీఎస్‌ను కోర్టు ఆదేశించింది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు ఎలాంటి చర్యలు చేపట్టొద్దని కోర్టు ఆదేశించడం జరిగింది. ప్రభుత్వం మార్చి 15న వేసిన కమిటీ అధికారులూ జవాబు ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. ఉల్లంఘనలు జరిగితే సీఎస్ వ్యక్తిగత బాధ్యత వహించాలని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది.

# ఓయూలో అరెస్టులు

ఉస్మానియా వర్సిటీ, మనం న్యూస్: ఉస్మానియా యూనివర్సిటీలో పోలీసుల ఆంక్షలు కొనసాగుతున్నాయి. విద్యార్థులు నిద్ర నుంచి లేవక ముందే హాస్టల్ గదుల్లోకి ప్రవేశించి బలవంతంగా ముందస్తు అరెస్టు చేసి వివిధ పోలీసుస్టేషన్లకు తరలించారు. సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చలో హెచ్‌సీయూ కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలోనే విద్యార్థి నాయకులను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ.. హెచ్చీయూ భూములు అమ్మేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నించడం దారుణం అన్నారు. కాంగ్రెస్ పార్టీ చెప్పుకుంటున్న ప్రజాపాలన అంటే ఇదేనా అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ఏడో గ్యారెంటీ అని చెప్పి ఓయూను పోలీసు రాజ్యంగా మార్చి విద్యార్థుల స్వేచ్ఛ, హక్కులను కాలరాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఓయూలో ఎలాంటి ఆందోళనలు చేయకూడదంటూ గత నెల 13న జారీ చేసిన ఏకపక్ష, నియంతృత్వ సర్క్యులర్‌ను వెనక్కి తీసుకోవాలని.. గత కొన్ని రోజులుగా శాంతియుతంగా నిరసనలు చేస్తున్నా ఇప్పటికీ అధికారులు స్పందించకపోవడం సిగ్గుచేటు అన్నారు. విద్యార్థులు లేవకముందే హాస్టల్ గదుల్లోకి వచ్చి వారిని బెదిరించి అరెస్టు చేస్తే అది ముమ్మాటికీ పోలీసు రాజ్యమేనని అన్నారు. ఎవరికి ఇష్టం ఉన్నా లేకపోయినా ఓయూలో ఇప్పుడు నడిచేది పోలీసుల రాజ్యమేనని ఉద్ఘాటించారు.

### వర్సిటీకి బదలాయించాలి

హెచ్‌సీయూ భూములను వేలం వేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం దారుణమని వివిధ విద్యార్థి సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఆ భూములను యూనివర్సిటీ పేరుపై రిజిస్ట్రేషన్ చేయాలని డిమాండ్ చేశారు. హెచ్సీయూ భూముల విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా వివిధ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ ఎన్‌సీసీ గేటు ఎదుట ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ, తక్షణమే వేలం నిలిపివేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర సచివాలయం దగ్గర అరెస్టు చేసిన విద్యార్థి నేతలను తక్షణమే విడుదల చేయాలని అన్నారు. ఓయూలో ధర్నాలు, నిరసనలు, ఆందోళనలు, నినాదాలు చేయకూడదని ఇచ్చిన అప్రజాస్వామిక సర్క్యులర్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని కోరారు. 1969 ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఉద్యమం తర్వాత అప్పట్లో కేంద్రంలో అధికారంలో ఉన్న ఇందిరాగాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో ఉన్న గ్రామీణ పేద మధ్యతరగతి విద్యార్థులకు అంతర్జాతీయ విద్య, ఉపాధి అవకాశాలు అందించాలనే లక్ష్యంతో 1973వ



సంవత్సరంలో భారత రాజ్యాంగంలో 32వ రాజ్యాంగ సవరణ ద్వారా సుమారుగా 2500 ఎకరాలు కేటాయించి యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌ను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. కానీ కాలక్రమంలో రాష్ట్ర ప్రభుత్వాలు అనేక అభివృద్ధి కార్యక్రమాల సాకు చెబుతూ యూనివర్సిటీ భూములను లాక్కున్నారని ఆరోపించారు. ఇటీవల 400 ఎకరాల హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూమిని రాష్ట్ర ప్రభుత్వానికి చెందుతుందని వాదిస్తూ మొత్తం సమాజాన్ని తప్పుదోవ పట్టిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మారుతున్న కాలానుగుణంగా సమాజంలో వచ్చే అనేక సమస్యలను పరిష్కరించేందుకు వర్సిటీలలో నూతన కోర్సులను ప్రవేశపెట్టి, విద్యను బోధించే అవసరం ఉంటుందని చెప్పారు. అందుకే యూనివర్సిటీలకు భూమి అవసరం అవుతుందని, అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీ లకు భూములను కేటాయించాలి కానీ లాక్కోకూడదని హితవు పలికారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ఓయూ కార్యదర్శి నెల్లి సత్య, ఎస్ఎఫ్ఐ ఓయూ ఉపాధ్యక్షుడు అజయ్, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు అశ్విన్, ఆదర్శ్‌యాదవ్, విజయ్, ఆకాష్, సందీప్, జస్వంత్‌రాజ్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# డ్రైవ్ సక్సెస్



**-పూర్తయిన జలమండలి 180 రోజుల డ్రైవ్**
**-3,185 కిలోమీటర్ల సీవరేజ్ లైన్ పనులు**
**-2.50 లక్షల మ్యాన్‌హోళ్లలో డీ-సిల్టింగ్**
**-సమష్టి కృషి వల్లే మంచి ఫలితాలు: ఎండీ అశోక్‌రెడ్డి**

ఖైరతాబాద్, మనం న్యూస్: సీవరేజ్ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీ హైదరాబాద్... ఇంకుడు గుంతల నిర్మాణం లక్ష్యంగా జలమండలి చేపట్టిన రెండో విడత 90 రోజుల స్పెషల్ డ్రైవ్ విజయవంతమయ్యింది. గాంధీ జయంతి రోజున ప్రారంభమైన డ్రైవ్ డిసెంబర్ 31న పూర్తికావడం.. రాబోయే వర్షాకాలం నేపథ్యంలో డ్రైవ్‌ను మరో 90 రోజులు పొడిగించి ఎలాంటి అదనపు ఖర్చు లేకుండా దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడం జరిగింది. వర్షాకాలం నాటికి సీవరేజ్ పైపులైన్లు, మ్యాన్ హోళ్లలో వ్యర్థాలు లేకుండా చూడాలని జలమండలి నిర్ణయించింది. అప్పటి నుంచి మార్చి 30 నాటికి నగరంలోని ప్రాంతాల్లో నిర్విరామంగా డీ-సిల్టింగ్ పనులు నిర్వహించారు. అక్టోబర్ 2 నుంచి మార్చి 30 నాటికి మొత్తం 180 రోజులు డీ సిల్టింగ్ పనులు చేపట్టారు. ఫలితంగా ఇప్పటి వరకు ఈ డ్రైవ్ ద్వారా 24,146 ప్రాంతాల్లో 3,185 కిలోమీటర్ల సీవరేజ్ పైపులైన్, 2.50 లక్షల మ్యాన్‌హోళ్లలో డీ-సిల్టింగ్ పనులు పూర్తి చేశారు. ఈ స్పెషల్ డ్రైవ్ ఫలితంగా రోజూ వచ్చే సీవరేజ్ ఫిర్యాదులు 20 నుంచి 30 శాతానికి తగ్గాయి. ఈ సందర్భంగా ఎండీ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో ఈ స్పెషల్ డ్రైవ్‌ను ప్రారంభించామన్నారు. ఈ స్పెషల్ డ్రైవ్ విజయవంతం కావడంలో జలమండలి అధికారులు, సిబ్బంది కృషి ఎంతో ఉందని కొనియాడారు. అందరి సమష్టి కష్టం వల్లే ఇది సాధ్యమైందన్నారు. రాబోయే రోజుల్లో ఇంతకు మించి సామర్థ్యంతో కష్టపడతామని చెప్పారు. ఇదే స్ఫూర్తితో జూన్ నాటికి మిగతా మ్యాన్‌హోళ్లు కూడా డీ సిల్టింగ్ పూర్తి చేయాలని సూచించారు.

**డాష్ బోర్డ్...**

స్పెషల్ డ్రైవ్ పనుల్ని రోజూవారీగా పర్యవేక్షించేందుకు ప్రత్యేక డాష్ బోర్డ్ ఏర్పాటు చేశారు. సీవరేజ్ ఓవర్ ఫ్లో, కలుషిత నీరు, రోడ్లపై సిల్ట్ తదితర వాటిపై ఎంసీసీకి వచ్చే ఫిర్యాదులను ఆయా క్యాన్ నంబర్లను జీపీఎస్ ఆధారంగా గూగుల్ మ్యాప్ లో నమోదు చేశారు. ఈ నమోదు ఒక్కో ప్రాంతంలో ఎన్ని సార్లు ఫిర్యాదులు అందినవి, ఎన్నిసార్లు పరిష్కరించిన వివరాలను ఆ మ్యాప్‌లో ఒక బబుల్ (బుడగ)లా కనిపించేలాగా ఏర్పాటు చేశారు. వచ్చిన ఫిర్యాదుల సంఖ్యను బట్టి.. ఆ బబుల్ పరిమాణం మారేలా ఏర్పాటు చేశారు. దీని వల్ల సమస్య తీవ్రతను బట్టి దాన్ని పరిష్కరించారు. ఇదే కాకుండా.. అలాగే ఈ డాష్ బోర్డును ఇప్పటి వరకు శుభ్రం చేసిన పైపు లైన్ల పొడవు, మ్యాన్ హోళ్ల సంఖ్య వివరాలు ఫొటోలతో సహా.. అప్‌లోడ్ చేసేలా రూపకల్పన చేశానరు. సిల్ట్ కార్టింగ్ వాహనాలు తిరిగే ప్రాంతాలు జీపీఎస్ సహకారంతో తెలుసుకునే వెసులుబాటు కల్పించామని చెప్పారు. ఎక్కడైనా కొత్త పైపులైన్ల నిర్మాణ ప్రతిపాదనను సైతం నమోదు చేసేలా రూపొందించినట్లు పేర్కొన్నారు. అన్ని రకాల రిపోర్టులను తయారు చేసి, వాటిని విశ్లేషించుకునే సౌకర్యం సైతం కల్పించారు. ఈ స్పెషల్ డ్రైవ్ పకడ్బందీగా అమలు చేసేందుకు గత మూడేళ్లలో వచ్చిన సీవరేజ్ ఫిర్యాదుల్ని విశ్లేషించారు. ప్రధానంగా వినియోగదారుల ఇళ్లల్లో లీకేజీ, రోడ్లపై సీవరేజ్ ఓవర్ ఫ్లో సమస్యల్ని గుర్తించారు. రోజూ వచ్చే ఫిర్యాదుల్లో 60 శాతం ఇవే రావడంతో వాటిపై దృష్టి సారించి పరిష్కరించారు.

# సోమ జగన్నాథం గుప్తా జ్ఞాపకార్థం



**పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ**

రాజేంద్రనగర్, ఏప్రిల్ 3 (మనం న్యూస్): జన్మనిచ్చిన తండ్రి జ్ఞాపకార్థం ఎన్ని సేవా కార్యక్రమాలను చేసినా వారి రుణం తీర్చుకోలేనిదని మైలార్ దేవ్ పల్లి డివిజన్ టిఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేష్ అన్నారు. గురువారం బాబుల్ రెడ్డి నగర్ లో సోమ జగన్నాథం గుప్తా జ్ఞాపకార్థం వారి కుమారుడు సోమ శ్రీనివాస్ గుప్తా, నీరజ దంపతులు నిర్వహించిన పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ....తల్లిదండ్రులు లేకపోతే మనం లేమన్న విషయాన్ని ప్రతిఒక్కరు గమనించాలని, ఇటువంటి గొప్ప కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సోమ శ్రీనివాస్ గుప్తా ప్రస్తుత సమాజంలో యువతకు ఆదర్శమన్నారు. కార్మికుల శ్రమను గుర్తించాలన్నారు. పారిశుద్ధ కార్మికులు తమ ఆరోగ్యాన్ని లెక్కచేయకుండా ప్రజా ఆరోగ్య కోసం అహర్నిశలు పనిచేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సోమ అశోక్ గుప్తా, సందీప్ గుప్తా, వనపర్తి ఆంజనేయులు, జగన్, హనుమంతు సగర్, కిషోర్, రమేష్, పూజారి రవి తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ఐటీ సెల్‌పై కేసు

గచ్చిబౌలి, మనం న్యూస్: నకిలీ వీడియోలు వైరల్ చేశారన్న ఆరోపణలపై బీఆర్ఎస్ ఐటీ సెల్‌పై గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇంచార్జి దిలీప్, క్రిశాంక్‌పై 353, 1(సీ), 353(2), 192, 196(1), 61(1)(ఏ) బీఎన్ఎస్ సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఉద్దేశపూర్వకంగానే వీడియోలు సృష్టించి వైరల్ చేశారని అభియోగం మోపారు. వీడియోలు ఎడిట్ చేసి ప్రజల్లో అశాంతి రేపేలా, రెచ్చగొట్టేలా ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్‌లో వైరల్ చేసినట్లు పోలీసులు ఆరోపిస్తున్నారు.

# ఏప్రిల్ 5న రవిస్ బ్రిలియంట్ స్కూల్‌లో 'స్పేస్ ఎక్స్ పో'

రాజేంద్రనగర్, ఏప్రిల్ 3 (మనం న్యూస్): భారత అంతరిక్ష పరిశోధ సంస్థ నేతృత్వంలోని జాతీయ రిమోట్ సెన్సింగ్ సెంటర్, కెఐ ల్యాబ్ సహకారంతో కాటేదాన్ శాంతినగర్ లోని రవిస్ బ్రిలియంట్ స్కూల్ ఆవరణలో ఈనెల 5వ తేదీన 'స్పేస్ ఎక్స్ పో' నిర్వహిస్తున్న ఆ పాఠశాల కరస్పాండెంట్ ఎస్.ఆర్. రజినీకాంత్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగే ఈ ఎక్స్ పో లో విద్యార్థులకు పరిశోధనల నమూనాల తయారీకి కావలసిన అద్భుతమైన అనుభవం లభించనుందన్నారు. విద్యార్థుల్లో సామాజిక, ఆర్థిక సమస్యల పరిష్కారాలను చూపే ఆలోచనల దిశగా ప్రదర్శన ఉంటుందన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్, అతిథులుగా మండల విద్యాశాఖ అధికారి కె. శంకర్ రాథోడ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేంట్ పాఠశాలల యాజమాన్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.ఎన్.రెడ్డి తదితరులు హాజరవుతారని రజినీకాంత్ తెలిపారు.

# హిందువులంతా సంఘటితం కావాలి

**వక్ఫ్ పేరిట అల్లర్లకు కొందరి ప్రయత్నం**
**కులాలకు అతీతంగా జాగృతమైతేనే మనుగడ**
**విశ్వహిందూ పరిషత్, బజరంగ్ నేతలు**




పంజాగుట్ట, మనంన్యూస్: హిందువులందరూ సంఘటితం కావాలని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహమూర్తి, విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి, బజరంగ్దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు పిలుపునిచ్చారు.సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో వారు విలేకరుల సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఏప్రిల్ 12న నిర్వహించే వీర హనుమాన్ విజయ యాత్ర (హనుమాన్ జయంతి) గోడపత్రికలను ఆవిష్కరించారు. గౌలిగూడ హనుమాన్ మందిర్ నుంచి తాడ్బండ్ హనుమాన్ మందిర్ వరకు ప్రతి సంవత్సరం నిర్వహించే వీర హనుమాన్ విజయ యాత్ర ఈసారి కూడా రెట్టింపు స్థాయిలో, అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు వారు చెప్పారు. రాజకీయాలు, కులాలకు అతీతంగా హిందూ శక్తి ప్రదర్శన కోసం ప్రతి ఇంటి నుంచి ఒక హిందూ కార్యకర్త తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విడిపోతే పడిపోతామని 'బటేగాతో కటేగా' అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ అవగాహన చేసుకోవాలని చెప్పారు. ' ఏక్ హై తో సేఫ్ హై' సంఘటితంగా ఉంటేనే ఏదైనా సాధించగలం అనే నినాదాన్ని అనుసరించాలన్నారు. వక్ఫ్ పేరుతో దేశంలో అల్లర్లు సృష్టించేందుకు కొంతమంది పనిగట్టుకొని ప్రయత్నం చేస్తున్నారని.. అటువంటి సంఘవిద్రోహ శక్తుల విషయంలో హిందూ సమాజం జాగ్రత్తగా ఉండాలని నాయకులు చెప్పారు. తమది కానీ ఆస్తిని తాము సొంతం చేసుకునేందుకు అడ్డదారిలో తీసుకువచ్చిన వక్ఫ్ బోర్డును నిషేధించాలన్నారు. విద్యార్థులు, మేధావులు, జర్నలిస్టులు, సమాజంలో ఉన్నటువంటి ప్రముఖులందరూ వక్ఫ్ విషయంలో అవగాహన పెంచుకోవాలని కోరారు. హిందువులందరికీ బజరంగ్ దళ్ అండగా ఉంటుందని భరోసా కల్పించేందుకే కాషాయ జెండాలతో శ్రీరామ నామ జపంతో భారీ ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు నాయకులు చెప్పారు. ప్రతి హిందువు తనకు తాను సొంతంగా ఆలోచించి వాస్తవాలను తెలుసుకోవాలని.. సంఘటితమైతేనే సంక్షేమం గా ఉంటామని విషయం గ్రహించాలన్నారు. కులాలకు అతీతంగా అందరం జాగృతమైతేనే హిందువుల మనుగడ సాధ్యమవుతుందని చెప్పారు. ఈ సమావేశంలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# అసోసియేట్ డీన్ డాక్టర్ గోవర్ధన్‌కు శుభాకాంక్షలు తెలిపిన బీసీ ఉద్యోగులు

రాజేంద్రనగర్, ఏప్రిల్ 3 (మనం న్యూస్): ఆచార్య జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్ అగ్రికల్చర్ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ గోవర్ధన్ రాజేంద్రనగర్ బీసీ ఉద్యోగులు గురువారం శుభాకాంక్షలు తెలిపారు.అసోసియేట్ డీన్ ప్రిన్సిపల్ కు,బీసీ టీచింగ్ నాన్ టీచింగ్ ఉద్యోగులు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తూ అగ్రికల్చర్ కాలేజీని,యూనివర్సిటీని ముందుకు తీసుకెళ్తామని అసోసియేట్ డీన్ కు తెలిపారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ ఉపేందర్, డాక్టర్ చైతన్య, డాక్టర్ ప్రశాంత్, అధ్యక్షులు బిక్షపతి, ప్రధాన కార్యదర్శి దశరథ్, రమేష్, జనార్ధన్,గణేష్ తదితరులు పాల్గొన్నారు.



# కూకట్ పల్లి జనసేన పార్టీ ఆఫీస్లో ఛత్రపతి శివాజీ మహారాజ్ వర్ధంతి

కేపీహెచ్బీ కాలనీ, మనం న్యూస్; ఛత్రపతి శివాజీ మహారాజ్ వర్ధంతిని పురస్కరించుకొని కేపీహెచ్బీ కాలనీ5వ ఫేస్ జనసేన పార్టీ ఆఫీస్ లో కూకట్ పల్లి నియోజక వర్గ జనసేన కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మా రెడ్డి ప్రేమకుమార్ ఛత్రపతి శివాజీ మహారాజ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రేమ కుమార్ మాట్లాడుతూ మరాఠా యోధుడు రాజు యుద్ధభూమిలో ఛత్రపతి శివాజీ మహారాజ్ శౌర్యసాహసాలకు గుర్తుగా ఏప్రిల్ 3న ఆయన వర్ధంతి జరుపుకుంటారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ నైపుణ్యం కలిగిన నాయకుడు, వీర యోధుడు. అతను గెరిల్లా యుద్ధంలో నిపుణుడు, రహస్య సైనిక కార్యకలాపాలను ప్లాన్ చేశాడు అని,అతని రహస్య యుద్ధం కారణంగా అతన్ని తరచుగా 'పర్వత ఎలుక' అని పిలుస్తారని అన్నారు. యవకులు కూడా ఛత్రపతి శివాజీని ఆర్శంగా తీసుకుని జీవించాల్సిన అవసం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కొల్లా శంకర్ , భోగాది వెంకటేశ్వరరావు ,వేముల మహేష్ ,కాలిగినీడి ప్రసాద్ , ఆత్మురి మోహన్ , పాదం సూర్య , మండల రమేష్ ,శేఖర్ ,మారుతి ,పులగం సుబ్బు , వీరమహిళ యాళ్ల శిరీష తదితరులు పాల్గొన్నారు.

# వెంకటపాపయ్య నగర్లో కార్పొరేటర్ పర్యటన




ఆల్విన్ కాలనీ, మనం న్యూస్; 124 ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని వెంకటపాపయ్య నగర్ లో డ్రైనేజ్,రోడ్ల వంటి వివిధ సమస్యలున్నాయని కాలనీ వాసులు గురువారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ను కలిసి కాలనీ సమస్యలను పరిష్కరించాలని కోరారు. వెంటనే స్పందిచిన కార్పొరేటర్ వెంకటయ్య నగర్ ఎ.ఇ శ్రావణి, కాలనీ వాసలతో కలిసి వెంకటయ్య నగర్లో పర్యటించి సమస్యలను తానే స్వయంగా తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వెంకటపాపయ్య నగర్ కాలనీలో కొంతమేర డ్రైనేజీ లైన్ మరియు డ్రైనేజీ లైన్ పూర్తయిన సీసీ రోడ్లకు ప్యాచ్ వర్క్ పనులు పూర్తిచేయవలసి ఉంది కాబట్టి సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలో పనులు పూర్తిచేస్తామని కాలనీ వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, జూపల్లి జనార్ధన్ రావు, దేవేందర్ రావు, నరసింహులు, జీవన్ రెడ్డి, విక్కీ, ఎల్లయ్య, వెంకటస్వామి గౌడ్, అశోక్, వెంకట్ రెడ్డి, అంకంరావు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరామ నవమి శోభాయాత్రకు దేశవ్యాప్తంగా ఖ్యాతి

**యాత్ర చివరి వరకు భారీ బందోబస్తు ఏర్పాట్లు**
**డ్రోన్ల సహాయంతో భద్రతా పర్యవేక్షణ**
**ఇతర వర్గాలను కించపరిచే వ్యాఖ్యలొద్దు**
**ప్రజలు, నిర్వాహకులు అధికారులకు సహకరించాలి**
**హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సివి ఆనంద్**






బంజారాహిల్స్,మనంన్యూస్: హైదరాబాద్ లో జరిగే శ్రీరామ నవమి శోభాయాత్రకు దేశవ్యాప్తంగా ఖ్యాతి ఉందని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సివి ఆనంద్ అన్నారు. శ్రీరామ నవమి శోభాయాత్రను పురస్కరించుకొని ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని గురువారం నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ ఆనంద్ మాట్లాడుతూ 2010లో శ్రీరామ నవమి శోభాయాత్ర ప్రారంభమై అనతి కాలంలోనే దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకొందన్నారు.ఈ ప్రతిష్టాత్మక యాత్రను శాంతియుతంగా,ఆధ్యాత్మిక చింతనతో జరిగేలా విజయవంతం చేసేందుకు హైదరాబాద్ సిటీ పోలీసు తరపున అన్ని ఏర్పాట్లను చేస్తున్నామన్నారు.శోభాయాత్ర ప్రారంభం నుంచి చివరి వరకు 20వేల మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించనున్నామని పేర్కొన్నారు.యాత్రకు సంబంధించిన వాహనాలు రహదారికి అనుగుణంగా ఉండేటట్లు ముందుగానే పరిశీలించాలని నిర్వాహకులకు సూచించారు.పోలీసు శాఖ తరపున డ్రోన్లతో నిరంతర పర్యవేక్షణ చేస్తామన్నారు. ఎవరైనా డ్రోన్లు వినియోగించాలనుకుంటే పోలీసుల అనుమతి తీసుకోవాలని తెలిపారు. డీజే బదులుగా సౌండ్ సిస్టం వినియోగించే ప్రయత్నం చేయాలన్నారు.శోభాయాత్ర సందర్భంగా ఇతర వర్గాలను కించపరిచే విధంగా పాటలు పెట్టొద్దని,స్పీచులు ఇవ్వొద్దని స్పష్టం చేశారు.ప్రజలు, నిర్వాహకులు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.భక్తిశ్రద్ధలతో పండుగలు జరుపుకోవాలని విన్నవించారు. నిర్వహణ అనుబంధ సమాచారం కోసం హైదరాబాదు జోనల్ పోలీసు అధికారులు, ఇతర శాఖల అధికారులు, సిబ్బంతో కలిపి వాట్స్ యాప్ గ్రూపులు తయారు చేసుకోవాలని సూచించారు.జిహెచ్ఎంసి అడిషనల్ కమిషనర్ రఘుప్రసాద్ మాట్లాడుతూ శోభాయాత్రకు బల్దియా తరపున అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండాలని తమ అధికార యంత్రాంగానికి మార్గదర్శకాలు జారీ చేశామన్నారు.ఈ సమావేశంలో అడిషనల్ పోలీసు కమిషనర్ లా అండ్ ఆర్డర్ విక్రమ్ సింగ్ మాన్,జాయింట్ పోలీస్ కమిషనర్ ట్రాఫిక్ జోయల్ డేవిస్, సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ జి.చంద్రమోహన్,ఈస్ట్ జోన్ డీసీపీ బి.బాలస్వామి,ఆర్టీసీ డివైఆర్ఎం శ్రీనివాస రావు, భాగ్యనగర్ ఉత్సవ కమిటీ సెక్రటరీ భగవంత రావు,ఆర్గనైజర్ కృష్ణ, జనరల్ సెక్రటరీ గోవింట్ రాట్కే,ఆర్గనైజర్ ఆనంద్ సింగ్, డిఎఫ్ఓ వెంకన్న, జలమండలి అధికారి అమరేందర్ రెడ్డి, ఎస్బీ డీసీపీ చైతన్యకుమార్, సౌత్ జోన్ డీసీపీ స్నేహా మెహ్రా, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.







# క్రెడిట్ నిష్పత్తి మెరుగుదల సమానం ఉంది

**-కేర్ ఎడ్జ్ రేటింగ్స్ సీనియర్ డైరెక్టర్ రంజన్ శర్మ**

బంజారాహిల్స్, మనం న్యూస్: ఇన్వెస్ట్మెంట్ గ్రేడ్ అండ్ సబ్ ఇన్వెస్ట్మెంట్ గ్రేడ్ రేటింగ్ కేటగిరీలు రెండింటిలోనూ క్రెడిట్ నిష్పత్తి మెరుగుదల సమానంగా ఉందని కేర్ ఎడ్జ్ రేటింగ్స్ సీనియర్ డైరెక్టర్ రంజన్ శర్మ అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల ఓ నివేదికను విడుదల చేశారు. ఆ సందర్భాన్ని పురస్కరించుకొని ఆయన మాట్లాడుతూ తమ నివేదిక ప్రకారం ఫైనాన్షియల్ ఇయర్ 25 అప్గ్రేడ్స్, డౌన్గ్రేడ్స్ నిష్పత్తి గణనీయంగా బలపడి 2.35 రెట్లకు చేరుకుందన్నారు. ఇది తొలి మూడు నెలల్లో నమోదైన 1.62 రెట్ల కన్నా ఎక్కువన్నారు. ఈ ఆరు నెలల కాలంలో మొత్తం 386 కంపెనీలు అప్గ్రేడ్లను పొందగా, 164 కంపెనీల రేటింగ్లు డౌన్గ్రేడ్ అయ్యాయన్నారు. బలమైన దేశీయ వినియోగం, ప్రభుత్వ వ్యయం నుండి లబ్ధి పొందిన రంగాల కారణంగా మొదటి అర్ధభాగంలో అప్గ్రేడ్ రేటు 12శాతం నుంచి 14శాతానికి పెరిగిందన్నారు. అయితే, మైక్రోఫైనాన్స్, అన్సెక్యూర్డ్ వ్యాపార రుణాలు అందించే ఎన్బీఎఫ్సీలలో ఆస్తి నాణ్యత ఆందోళనలు, కెమికల్, ఐరన్ అండ్ స్టీల్ రంగాల్లోని చిన్న సంస్థలు, ఎగుమతి ఆధారిత కట్ అండ్ పాలిష్డ్ డైమండ్ సంస్థలు ఎదుర్కొంటున్న ధరల ఒత్తిడి కారణంగా డౌన్గ్రేడ్ రేటు 200 బేసిస్ పాయింట్లు తగ్గి 6శాతానికి చేరుకుందన్నారు. ఇది ఇండియా ఇంక్ స్థితిస్థాపకతను తెలియజేస్తున్నప్పటికీ, అమెరికా సుంకాల విధింపు, ఇతర దేశాల నుండి పెరుగుతున్న ధరల పోటీ ఎగుమతి ఆధారిత రంగాలకు సవాళ్లను విసరవచ్చని కేర్ఎడ్జ్ అభిప్రాయపడ్డామన్నారు. ఇన్వెస్ట్మెంట్ గ్రేడ్,సబ్-ఇన్వెస్ట్మెంట్ గ్రేడ్ రేటింగ్ కేటగిరీలు రెండింటిలోనూ క్రెడిట్ నిష్పత్తి మెరుగుదల సమానంగా ఉందని, మిడ్-కార్పొరేట్ సంస్థలు బలమైన దేశీయ డిమాండ్ను అందిపుచ్చుకోవడం ద్వారా ఈ వృద్ధికి చోదకశక్తిగా నిలిచాయని ఆయన పేర్కొన్నారు. మూలధన వస్తువులు, వాహన రంగం, ఆటోమోటివ్ భాగాలు, రియల్ ఎస్టేట్ వంటి రంగాలు అప్గ్రేడ్ వేవ్కు నాయకత్వం వహించాయని, ఇవన్నీ పెరుగుతున్న వినియోగం, మౌలిక సదుపాయాల అభివృద్ధి నుంచి ప్రయోజనం పొందాయని ఆయన వివరించారు. అయితే, బేసిక్ కెమికల్స్, చిన్న తరహా ఇనుము అండ్ ఉక్కు సంస్థలు, ఎగుమతి-కేంద్రీకృత సీపీడీ సంస్థలు డౌన్గ్రేడ్లను ఎదుర్కొన్నాయని నివేదిక పేర్కొంది. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ రంగం క్రెడిట్ నిష్పత్తి తొలి మూడు నెలల్లో 2.75 నుంచి రెండో విడతలో 1.07కి తగ్గిందన్నారు. మైక్రోఫైనాన్స్, అన్సెక్యూర్డ్ వ్యాపార రుణ విభాగాలలో ఒత్తిడి పెరగడం దీనికి కారణమని కేర్ఎడ్జ్ రేటింగ్స్ సీనియర్ డైరెక్టర్ సంజయ్ అగర్వాల్ తెలిపారు. మౌలిక సదుపాయాల రంగం మాత్రం నిలకడగా వృద్ధిని కనబరిచిందని వెల్లడించారు.

# పేదింటి కలను సహకారం చేసిన రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్‌ను అభినందించిన మాజీ మంత్రి హరీష్ రావు

**రాధాకృష్ణ ట్రస్టు ద్వారా నిర్మించిన ఇంటిని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన హరీష్ రావు**

**కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీష్ రావు నిప్పులు చెరిగారు**

**రేవంత్ రెడ్డి కూలగొట్టుడు తప్ప కట్టుడు తెల్వని ఏకైక సీఎం**

**ఆరు గ్యారెంటీలు కాదు అరగారంటీలు కూడా నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వం**

**దమ్ముంటే బందోబస్తు లేకుండా ప్రజల్లో తిరగాలని సవాల్**





(మనం ఏప్రిల్ 03/తలకొండపల్లి): పేదింటి కలను సహకారం చేసిన జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ సేవలను మాజీమంత్రి, సిద్దిపేట్ శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు తోటు మాజీ మంత్రి, మహేశ్వరం శాసనసభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి లు అభినందించారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలంలోని ముద్విన్ గ్రామంలో గత ఏడాది రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఇంటిని గురువారం హరీష్ రావు చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రస్టు చైర్మన్, మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ పేద ప్రజలకు తన ట్రస్టు ద్వారా చేస్తున్న సేవలను కొని ఆడారు. ముమ్మందు తన ట్రస్ట్ పేద ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని సూచించారు. అనంతరం సిరికొండ గ్రామ పంచాయతీ పరిధిలో బోయిన్ గుట్ట తండాలో సేవాలాల్ మహారాజ్, అంబేద్కర్, మహాత్మా గాంధీ విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం సభలో పాల్గొన్న హరీష్ రావు కాంగ్రెస్ ప్రభుత్వం పై నిప్పులు జరిగారు. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నంతకాలం అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఏడాదిన్నర కాలంలోనే హరిగోశలు పడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో అరహామీ కూడా నెరవేర్చలేదని పండిపడ్డారు. తెలంగాణ ప్రజలను అనేక హరిగోశలు పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి త్వరలో తగిన బుద్ధి చెప్పాలని సూచించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం చిత్తశుద్ధిగా పనిచేస్తే ఇన్ని సమస్యలు ఎందుకు ఉంటాయని పైరయ్యారు. ప్రజా పాలనను గాలికి వదిలి తన కుటుంబ ఆదాయాన్ని పెంచుకుంటున్నాడని సూచించారు. దమ్ముంటే రేవంత్ రెడ్డి బందోబస్తు లేకుండా బోయిన గుట్ట తండకు రావాలని సవాల్ విసిరారు. రేవంత్ రెడ్డి సర్కార్ ది మాయ మాటలు తప్ప చేతలు ఒక్కటి లేదని అన్నారు. ప్రజలను మోసం చేసింది కాకుండా చివరికి దేవుళ్ళను కూడా ఒట్టేసి మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రాంపాల్ నాయక్ జడ్పిటిసిలు ఉప్పల వెంకటేష్, అనురాధపత్యా నాయక్, విజితా రెడ్డి, మాజీ ఎంపీపీలు మాజీ సర్పంచ్లు, మాజీ ఎంపిటిసిలు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



# ఆనందోత్సాహాల మధ్య సన్నబియ్యం పంపిణీ

ఓల్ బోయిన్పల్లి, మనం న్యూస్; ప్రజా సంక్షేమం కోసం ప్రవేశపెట్టే ఏ పథకమైన ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రతీ కార్యకర్త నాయకుడిపై ఉందని కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం ప్రజా పంపిణీ కార్యక్రమాన్ని గురువారం ఆయన ఓల్ బోయిన్పల్లిలో కార్యకర్తల ఆనందోత్సాహాల మధ్య అంజయ్యనగర్లో ప్రారంభించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏదైనా పని అనుకుంటే సాధించి చూపెడతారని అందుకు నిదర్శనం ఈ సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం అన్నారు. దేశంలో ముందుగా ప్రజా పంపిణీ వ్యవస్థను ప్రారంభించింది కాంగ్రెస్ పార్టీ అన్నారు. ఈ పథకం ద్వారా లక్షల మంది పేద ప్రజలకు ఆర్థికంగా ఎంతో లబ్ది చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దండగుల యాదగిరి, లక్ష్మయ్య, మల్లికార్జున్ యాదవ్, కనకరాజు, కుంటయ్య, షహేన్షా, మోహన్ ,అశోక్, అస్లాం, అంజాద్, ముస్తాఫ్ అలీ,అక్తర్, గౌస్ ,గోపాల్, శ్రీను, మల్లేష్, సందీప్, వెంకటేష్, ఆనంద్, మహేష్, శివ చౌదరి ,రమణ, శ్రావణి, సభ, ప్రీతి , సల్మా తదితరులు పాల్గొన్నారు.



# బబ్బుగూడ నాళాను పరిశీలించిన మాజీ కార్పొరేటర్

కేపీహెచ్బీ కాలనీ, మనం న్యూస్; బబ్బుగూడ నాళాను పరిశీలించి ముందస్తు చర్యలు చేపట్టాలని మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ అధికారులకు సూచించారు.గురువారం కురిసిన అకాల వర్షం వల్ల బబ్బుగూడ నాళా నిండి ఇళ్ళలోకి నీరు వచ్చే ప్రమాదం పొంచి ఉందని స్థానికులు మూసాపేట్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ దృష్టికి తీసుకురావడంతో వెంటనే ఆయన ఆ ప్రాంతంలో పర్యటించి నాళా ప్రవాహాన్ని పరిశీలించారు. నాళాలో చెత్తా చెదారం పేరుకుపోయి ప్రవాహానికి అడ్డు తగులుతుందని గమనించి ఫోన్ ద్వారా అధికారులను సంప్రదించి సమస్యను వివరించారు. సానుకూలంగా స్పందించి సమస్య రాకుండా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తిరుపతి, కాలనీల అధ్యక్షులు బోడ శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, మాజీద్, వెంకటేష్, హరిబాబు,రాజ్ కుమార్, సుందర్, మణి రాజ్ గౌడ్,ఆజామ్, నాయుడు తదితరులు పాల్గొన్నారు

# బిఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**

శేరిలింగంపల్లి, మనం న్యూస్; బిఆర్ఎస్ పార్టీ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు విస్తృతంగా తీసుకువెళ్లాలని గురువారం కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శేరిలింగంపల్లి నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సంరద్భంగా నేడు జరుగుతున్న విధ్వంసాన్ని, శేరిలింగంపల్లిలోని హెచ్సియులో వన్య ప్రాణులకు, ప్రకృతికి జరుగుతున్న అన్యాయాన్ని ప్రజల్లోకి తీసుకెల్లి ప్రజా వ్యతిరేక నిర్ణయాలతో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను తిప్పి కొట్టాలని కార్యకర్తలకు వివరించారు. నాడు కెసిఆర్ ప్రకృతిని కాపాడుతూ హరితహారం పేరుతో చెట్లు నాటి జీవరాశులకు ,భవిష్యత్ తరాలకు ప్రాణాధారమైన ఆక్సిజన్ శాతాన్ని అభివృద్ధి చేయడమే కాకుండా చెరువులు, కుంటలు ప్రాజెక్టులతో జలకళతో తెలంగాణ రాష్ట్రం పరిపూర్ణంగా ఉండేదన్నారు. కానీ నేడు ఆ పరిస్థితి కానరావడం లేదని ఎక్కడ చూసినా ఎండిన చెరువులు, కుంటలు, అభివృద్ధి పేరుతో చెట్లు నరకడం వంటి కార్యక్రమాలు జరుగుతున్నాయని విచారం వ్యక్తం చేశారు. ఇవన్నీ కూడా ప్రజలకు తెలియ చెప్పాలని బిఆర్ఎస్ పార్టీ కచ్చితంగా రాబోయే రోజుల్లో అధికారంలోకి వస్తుందని ప్రతీ కార్యకర్తను కూడా పార్టీ గుర్తుపెట్టుకుని వారి అభివృద్ధికి కృషి చేస్తుందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ నెల 27వ తేదీన జరుగు ప్లీనరీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శేర్లింగంపల్లి డివిజన్ టిఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు, కూకట్పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు, గోపరాజు శ్రీనివాస్ రావు, కలిదిండి రోజా, బీఎస్ఎం కిరణ్ యాదవ్,మెడ్చస్ శ్రీనివాస్,సయ్యద్ ముజిద్, మారబోయిన రవి యాదవ్, శ్రీకాంత్, సాయి మిద్దెల మల్లారెడ్డి,ఆర్.కె గౌడ్,తిరుమలేష్, శ్రీనివాస్ గౌడ్ సలీం పాషా, బాబు మియా, ఏబీవీ శ్రీకాంత్, పండరి శ్రీకాంత్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# బీఆర్ఎస్ హయాంలో జరిగన అక్రమాలను సాక్ష్యాలతో సహా బయటపెడతాం

**కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్**



బాలానగర్, మనం న్యూస్; పది సంవత్సరాల బీఆర్ఎస్ గవర్నమెంట్ హయాంలో జరిగిన అవినీతి అక్రమాలను సాక్షాధారాలతో సహా బయట పెడతామని కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ అన్నారు. గురువరాం బాలానగర్లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో హెచ్సియూ భూమి వివాదంపై బీఆర్ఎస్, బిజెపి చేస్తున్న కుట్రల గురించి ఆయన మీడియాతో మాట్లాడారు. హెచ్సియు భూముల వివాదంలో విద్యార్థులను ముందుకు నెట్టి వారిని రాజకీయాలకు వాడుకుంటున్నారని ఆయన ధ్వజమెత్తారు. కూకట్పల్లి శాసనసభ్యుడు మాధవరం కృష్ణారావు హెచ్సియు భూములపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సీఎం ముఖ్యమంత్రిని విమర్శించడంపై ఆయన ఘాటుగా స్పందించారు. దొంగే దొంగ అన్నట్లు కృష్ణారావు తీరు ఉందన్నారు. గత 1౦ ఏళ్లలో కూకట్పల్లి నియోజకవర్గంలో చెరువులు కుంటలు శిఖం భూములు చివరకు నాలాలను సైతం వదలకుండా కబ్జా చేసాడని వీటన్నింటి వ్యవహారం బయటకు తీస్తామని ఎమ్మెల్యే తీరును ఎండగడతామని రమేష్ హెచ్చరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల నాగిరెడ్డి , తూము వేణు , లక్ష్మయ్య, దండగుల యాదగిరి, పుష్ప రెడ్డి ,గోపిశెట్టి రాఘవేంద్ర,కుక్కల రమేష్, మేకల రమేష్, మధు గౌడ్, ఐజాచ్ ,శివ చౌదరి, ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు పాల్గొన్నారు.

## హెచ్సీయు భూములు అన్యాక్రాంతం అవుతుంటే స్థానిక ఎమ్మెల్యేకి మౌనం ఎందుకు? : సిందం శ్రీకాంత్



కేపీహెచ్బీ కాలనీ, మనం న్యూస్; ఆచరణ సాధ్యం కానీ హామీలు ఇచ్చి, ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైన రేవంత్రెడ్డి ప్రభుత్వం సంపద సృష్టించడం చేతకాక ఇప్పుడు విలువైన సెంట్రల్ యూనివర్సిటీ భూముల మీద కన్నేసి వాటిని అమ్మాలని చూడడం సిగ్గుచేటు అని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు న్యాయవాది సింధం శ్రీకాంత్ విమర్శించారు. యూనివర్సిటీ భూముల విక్రయాన్ని అడ్డుకోవడానికి నిరసన తెలుపుతున్న విద్యార్థులపై అమానుషంగా లాఠీ చార్జీలు చేసి కేసులు బనాయించడం కాంగ్రెస్ ప్రభుత్వం దిగజారుడుతనానికి నిదర్శనం అని ఆయన విమర్శించారు. గతంలో పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణి సంరక్షణ అంటూ ఉదరగొట్టే ఉపన్యాసాలు ఇచ్చినటు వంటి సీఎం రేవంత్ రెడ్డి కి ఇప్పుడు పర్యావరణ సంరక్షణ, వన్యప్రాణి పరిరక్షణ అనే విషయాలు గుర్తుకు లేవా అని ఆయన ప్రశ్నించారు.ఇంత దుర్మార్గం తన నియోజకవర్గంలో జరుగుతున్నా స్థానిక ఎమ్మెల్యే ఆర్కెపూడి గాంధీ ఎందుకు మౌనం వహిస్తున్నారని ఆయన ప్రశ్నించారు.ఒకవైపు టిఆర్ఎస్ పార్టీ సెంట్రల్ యూనివర్సిటీ భూముల అమ్మకాన్ని వ్యతిరేకిస్తూ ఉంటే మరొకవైపు బిఆర్ఎస్ ఎమ్మెల్యేని అని చెప్పుకునే అరికెపూడి గాంధీ ఎందుకు మాట్లాడలేదు. నిజంగా ఆయన బిఆర్ఎస్ పార్టీలోనే ఉంటే ఇకనైనా మనం వీడి ఎమ్మెల్యే గాంధీ టిఆర్ఎస్ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు ప్రజల పక్షాన నిలబడాలని ఆయన డిమాండ్ చేశారు.



## బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన బందయ్యకు ఘన సన్మానం

రాజేంద్రనగర్, ఏప్రిల్ 3 (మనం న్యూస్): రాజేంద్ర నగర్ కోర్ట్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గా ఎన్నికైన జీ. బందయ్య ను బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, శ్రేయోభిలాషులు శాలువ, పూల మాలలతో ఘనంగా సన్మానించారు. తనపై నమ్మకం తో ఓట్లేసి గెలిపించిన న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం కొత్త గా ఎనికైనా బార్ అసోసియేషన్ కు పూర్తి బాధ్యతలు అప్పగించడం జరుగుతుందని అయన తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమం లో న్యాయవాదులు డి. భూపాల్, కోరని రవీందర్, గణేష్, క్రాంతికుమార్ ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

# కార్పొరేటర్ సుజాత నాయక్‌కు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి క్షమాపణ చెప్పాలి

**అవమానించినందుకు కాళ్లు కడిగి నెత్తిన పోసుకొని క్షమాపణ కోరాలి**

**కేసు నుంచి కాపాడాలని అసెంబ్లీ లాబీలలో సీఎం, మంత్రుల కాళ్లు పట్టుకొని వేడుకుంటున్నాడు**

**కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుంటే.. దొంగ చాటున కొబ్బరికాయలు కొట్టడం సిగ్గుచేటు**

**సుధీర్ రెడ్డిపై ఘాటు విమర్శలు, ఫైర్ అయిన మధు యాష్కీ గౌడ్**



రంగారెడ్డి,ఏప్రిల్4(మనం న్యూస్) కార్పొరేటర్ సుజాత నాయక్ పై ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు సహించరానివని సుధీర్ రెడ్డికి నీతి, నిజాయితీ సిగ్గ , శరం, లజ్జ ఉంటే సుజాత నాయక్ కాళ్ళు మొక్కి క్షమాపణ వేడుకోవాలని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ అన్నారు. గురువారం వనస్థలిపురం పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మధు యాష్కి గౌడ్ మాట్లాడుతూ.. మహిళలను గౌరవించాల్సిన సంస్కారం , సభ్యత సుధీర్ రెడ్డి కి లేదని విమర్శించారు. గిరిజన మహిళ కార్పొరేటర్ వ్యక్తిత్వాన్ని అవమానిస్తూ అనుచిత వ్యాఖ్యలు చేసిన సుధీర్ రెడ్డి ఇప్పటి వరకు క్షమాపణ చెప్పకపోవడం దుర్మార్గమన్నారు. మీ ఇంట్లో కూడా మహిళలు ఉన్నారు కదా..? ఇలానే ఎవరైనా మాట్లాడితే ఊరుకుంటావా ? అని ప్రశ్నించారు. ఏమాత్రం నీతి , నిజాయితీ ఉన్న సుధీర్ రెడ్డి .. కార్పొరేటర్ కాళ్లు కడిగి నెత్తిన నీళ్లు చల్లుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సుధీర్ రెడ్డి పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు అయినందున న్యాయపరంగా పోరాటం ఉంటుందని, పోలీసులు కూడా వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. చేసిన తప్పుకు క్షమాపణ చెప్పకపోగా.. కాపాడాలని అసెంబ్లీ లాబీలలో సీఎం, మంత్రుల కాళ్ల పట్టుకొని బతిమిలాడుతున్నాడని ఆరోపించారు. సుధీర్ రెడ్డి మాట్లాడిన మాటలు సభ్య సమాజం అసహ్యించుకుంటుందని, ఆయన పార్టీ అధినేత కేసిఆర్ కూడా క్షమించటం లేదని పేర్కొన్నారు. సమయం వచ్చినప్పుడు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గ అభివృద్ధికి గత బీఆర్ఎస్ పాలనలో పది సంవత్సరాలలో రాని నిధులు .. 15 నెలల తమ రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వంలో వచ్చాయని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం, మా ప్రభుత్వం.. నిధులు మంజూరు చేస్తే తట్టుకోలేక, దొంగ చాటున భూములు కబ్జాలు చేసే గల్లీ లీడర్లు, రౌడీ షీటర్లను వెంట వేసుకొని వెళ్లి సుధీర్ రెడ్డి కొబ్బరికాయలు కొడుతూ శంకుస్థాపనలతో డ్రామాలు చేస్తున్నారని విమర్శించారు. మీ తొట్టి గ్యాంగుల ఆటలు సాగవాని హెచ్చరించారు. పార్కులకు తాళాలు వేస్తున్నారని అబద్ధాలు చెబుతూ కాలం వెళ్లదీస్తున్నాడని, పార్కుల పేరుతో ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి అక్రమ సంపాదనతో సుధీర్ రెడ్డి వేలకోట్లకు ఎదిగాడని ఆరోపించారు. మలక్ పేట్ లో సుధీర్ రెడ్డి సైకిల్ పై తిరిగే రోజుల్లో, తాను బైక్ పై తిరిగానని.. కానీ అక్రమ సంపాదనతో ఈరోజు సుధీర్ రెడ్డి వేలకోట్లకు పడగలెత్తాడని విమర్శించారు. జిల్లా ఇన్చార్జి మంత్రి ఆధ్వర్యంలో ప్రోటోకాల్ ప్రకారం అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరుగుతాయని అన్నారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జిగా అభివృద్ధి పనులకు తాను సహకరిస్తున్నానని, రాజకీయాలకతీతంగా అభివృద్ధి చేపట్టాలన్నదే తన ఉద్దేశమన్నారు. ఈనెల 7న ఎల్బీనగర్ నియోజకవర్గం లో అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవానికి జిల్లా ఇన్చార్జి మంత్రి శ్రీధర్ బాబు హాజరు అవుతున్నారని పేర్కొన్నారు. ప్రోటోకాల్ ప్రకారం ఎమ్మెల్యే కూడా వచ్చి కొబ్బరికాయ కొట్టవచ్చునని పేర్కొన్నారు. అంతేకాని తన జేబులో నుంచి డబ్బులు ఇస్తున్నట్లుగా దొంగ చాటుగా కొబ్బరికాయలు కొట్టి.. చిల్లర రాజకీయాలు చేయవద్దు అని హెచ్చరించారు. మంత్రిగారు హాజరయ్యే రోజున కొబ్బరికాయ కొట్టి ఆ నీళ్లు నెత్తిన చల్లుకొని సుజాత నాయక్ ను క్షమాపణ కోరాలని హితవు పలికారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రాగుల వెంకటేశ్వర రెడ్డి, బానోతు సుజాత నాయక్, పీసీసీ సెక్రెటరీ గజ్జి భాస్కర్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు కుట్ల నర్సింహా యాదవ్, చెన్నగోని రవీందర్ గౌడ్, శ్రీపాల్ రెడ్డి, శశిధర్ రెడ్డి, మంజుల రెడ్డి, వేణుగోపాల్ యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాశం అశోక్ గౌడ్, బుడ్డా సత్యనారాయణ, నేలపాటి రామారావు, గణేష్ నాయక్, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు పసుపులేటి సాయి నికేష్, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, గజ్జి శ్రీనివాస్ యాదవ్, బండి గారి శ్రీనివాస్ గౌడ్, కళ్లెం సుజాత రెడ్డి, వసంత, రాజేశ్వరి, రజిని రావు, అనసూయ కవిత, పుష్పనీలా, మణి శ్రీ, ఎస్టీ సెల్ ఎల్బీనగర్ అధ్యక్షులు రమేష్ నాయక్, భీముడి రామకృష్ణారెడ్డి, కోటగిరి శ్రీనివాస్, చెరుకు భవాని శంకర్, గుర్రం చంద్రశేఖర్, పెద్దలు, విజయ పాల్ రెడ్డి, బోడ రాజశేఖర్, తోకటి కిరణ్, కారుకొండ శివ, తదితరులు పాల్గొన్నారు.

## ఆయుర్వేదిక్ ఆసుపత్రిని ప్రారంభించిన ఎమ్మెల్యే,ఎమ్మెల్సీ



కేపీహెచ్బీ కాలనీ, మనం న్యూస్; కూకట్ పల్లి బాలాజీ నగర్లో నూతనంగా ఏర్పాటు చేసిన ఐజేక్స్ ఆయుర్వేదిక్ ఆసుపత్రిని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు,ఎమ్మెల్సీ నవీన్ రావు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఆస్పత్రి లోని పలు విభాగాలను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ నాయకులు వడ్డేపల్లి రాజు ప్రారంభించారు. ఆసుపత్రి నిర్వాహకులు మాట్లాడుతూ, ఆయుర్వేద వైద్యం ప్రపంచంలోనే అత్యంత పురాతనమైనదని, అయితే ప్రస్తుతం అది కొంత వెనకబడినట్లు కనిపిస్తోందని తెలిపారు. ఆయుర్వేదం ద్వారా ప్రతి వ్యాధికీ సమర్థమైన చికిత్స అందించవచ్చని వివరించారు. ఆస్పత్రిలో పంచకర్మ ట్రీట్మెంట్, గ్యాస్ట్రైటిస్, సోరియాసిస్ వంటి సమస్యల కోసం ప్రత్యేక చికిత్సలు అందుబాటులో ఉంచామని చెప్పారు. గత 15 ఏళ్లుగా ఆయుర్వేద రంగంలో అనుభవాన్ని సంపాదించామని, ఇప్పుడు అత్యాధునిక సౌకర్యాలతో ఈ ఆసుపత్రిని ప్రారంభించామని తెలిపారు.

## డిప్యూటీ రీజినల్ మేనేజర్ అపర్ణ కళ్యాణి

కేపీ హెచ్బీ కాలనీ, మనం న్యూస్; ప్రయాణికుల సమస్యలు పరిష్కరించడానికి తనవంతు కృషి చేస్తానని డిప్యూటీ రీజినల్ మేనేజర్ అపర్ణ కళ్యాణి తెలిపారు. గురువారం కూకట్పల్లి నియోజకవర్గం ప్రశాంత్ నగర్ ప్రాంతంలోని బస్సు భవన్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కూకట్పల్లి డివిజన్ పరిధిలోని కూకట్పల్లి మియాపూర్ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ జీడిమెట్ల డిపో పరిధిలోని ప్రయాణికుల సమస్యలను తెలుసుకొని పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానని విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి డిపో మేనేజర్ హరి తో పాటు ఉద్యోగులు పాల్గొన్నారు.



# ఇటుక రాళ్లతో మోది బాలుడు హత్య

**స్నేహితులే కాలయములయ్యారు**





రాజేంద్రనగర్, ఏప్రిల్ 3 (మనం న్యూస్): తమపై లేని పోనీ పుకార్లు సృష్టిస్తున్నాడని ఆగ్రహించిన స్నేహితులు తోటి స్నేహితుని ఇటుక రాళ్లతో మోది అతికిరాతంగా హత్య చేశారు. ఈ సంఘటన గురువారం ఉదయం 7:30 గంటలకు వెలుగు చూసింది. సమాచారం అందుకున్న అత్తాపూర్ పోలీసులు బాలుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు కు సంబంధించిన వివరాలు అత్తాపూర్ ఇన్స్ పెక్టర్ నాగేశ్వర్ రావు తెలిపారు. రాజేంద్రనగర్ సర్కిల్ సులేమాన్ నగర్ డివిజన్ మహమూదనగర్ ప్రాంతానికి చెందిన రఫీక్ బ్యాండ్ వాయించే పని చేస్తుంటాడు. అతని కుమారుడు సింప్లాన్ (15) ఇంటి వద్దనే ఉంటాడు. బుధవారం రాత్రి రఫీక్ బ్యాండ్ వాయించడానికి వెళ్లగా సింప్లాన్ రాత్రి 10 గంటలకు స్నేహితులతో కలసి ఇంటినుంచి బయటకు వెళ్లాడు. ఉదయం మహమూద్ నగర్ ను ఆనుకుని ఉన్న మీరాలం చెరువు సమీపంలో సింప్లాన్ హత్యకు గురై పడి ఉన్నాడు. చూసిన స్థానికులు అత్తాపూర్ పోలీసులకు సమాచారం అందించారు. ఇన్స్ పెక్టర్ నాగేశ్వర్ రావు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతదేహం ఫోటోలను వాట్సాప్ ద్వారా పరిసర బస్తీల ప్రజలకు పంపిస్తే అతను మహమూద్ నగర్ కు చెందిన రఫీక్ కుమారుడు సింప్లాన్ గా గుర్తించారు. విచారణలో స్నేహితులతో కలసి రాత్రి 10 గంటల సమయంలో బయటకు వచ్చిన సింప్లాన్ ను తెలిసిన మరో ఇద్దరు మిత్రులు కలిసి హత్య చేశారని గుర్తించారు. ఇద్దరు నిందితులను అజార్ నాగేందర్ గా పోలీసులు గుర్తించారు. సింప్లాన్ స్నేహితులకు లేని పోని మాటలు చెబుతు ఒకరికొకరు గొడవలు పడేటట్లు చేస్తున్నాడని ఆగ్రహించిన మిత్రులు ఆ బాలున్ని ఇటుక రాళ్లతో మొఖం పై కొట్టి హత్య చేశారు.ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు.



## అభివృద్ధిపనులపై మున్సిపల్ అధికారులతో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సమీక్షా సమావేశం

కేపీహెచ్బీ కాలనీ, మనం న్యూస్; నియోజకవర్గంలోని చెరువులు, నాళాలు అభివృద్ధి చేసేటప్పుడు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. గురువారం మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్ కుమార్, జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్తో కలిసి మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రధానంగా నియోజకవర్గంలోని చెరువులు ,నాళాల అభివృద్ధికి సంబంధించి గతంలో నిధులు మంజూరయ్యి, పనులు ప్రారంభించిన వాటిని త్వరితగతిని పూర్తిచేసే విధంగా అలాగే రాబోయే వర్షాకాలం దృష్ట్యా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ప్రజలకు ఇబ్బందులు లేకుండా నియోజకవర్గంలోని తొమ్మిది చెరువులు, నాళాలు అభివృద్ధి చేసేటప్పుడు వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఇందులో భాగంగా సున్నం చెరువుకు కల్వర్టు నిర్మించాలని అక్కడున్న స్థానికులకు సరైన ఏర్పాట్లు చూడాలని సూచించారు. ఐడియల్ చెరువు నుంచి కూకట్పల్లి డిపో వరకు నాలా అభివృద్ధి పనులను పర్యవేక్షించి దానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా సత్వరమే చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఫతేనగర్ లోని దీన్ దయాల్ నగర్ నాలా వద్ద అక్కడ నిరుపేదలకు ఇబ్బంది లేకుండా స్థలాన్ని సేకరించి కల్వర్టు నిర్మాణ పనులు కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, సబియా గౌసుద్దీన్, పండాల సతీష్ గౌడ్ , ముద్దమ్ నరసింహా యాదవ్ ,పగుడాల శిరీష బాబురావు ,మాజీ కార్పొరేటర్ తూము శ్రవణ్ కుమార్ ,మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షులు మహమ్మద్ గౌసిద్దీన్, ఇంజనీరింగ్, వాటర్ వర్క్స్, హెచ్ఎండిఏ , ఎస్ఎన్డిపి, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.




## ఘనంగా దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు



రాజేంద్రనగర్, ఏప్రిల్ 3 (మనం న్యూస్): తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలను మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని బాబు రెడ్డి నగర్ లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్ కె పి ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు కొల్లంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన యోధుడు కొమురయ్య అని కీర్తించారు. దొడ్డి కొమరయ్య పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. చంటనగరాల అధ్యక్షుడు వెంకటేష్ కురుమ మాట్లాడుతూ...

మహనీయులను ఒక కులానికో, ఒక వర్గానికో పరిమితం చేయకుండా ఆయన ఆశయాలను నేటితరం ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు.

ఆయన త్యాగాలను గుర్తుచేసుకుంటూ, సమాజంలో సమానత్వం, న్యాయం, ఐక్యత కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పాలమూరు ఉమ్మడి జిల్లా అధ్యక్షులు జట్రం కృష్ణ, హెచ్ కె పి ఎస్ కార్యదర్శి రామ్ చందర్, ఉప్పల్ శ్రీను, మల్లేష్, అశోక్ కుమార్, రాజ్ కుమార్, ప్రవీణ్, సన్నీ, ఆనంద్, రఘు, రవి, శేఖర్, శంకర్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు

## హెచ్సీయూలో హైకోర్టు రిజిస్ట్రార్ పర్యటన

**రిజిస్ట్రార్ రావడంతో బారికేడ్లు తొలగింపు**
**రిజిస్ట్రార్ వెళ్లిపోయాక మళ్ళీ యథాస్థితి**
**భారీగా మోహరించిన పోలీసులు**
**పోలీసుల వలయంలో విశ్వవిద్యాలయం.**

గచ్చిబౌలి, మనం న్యూస్; సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు హైకోర్టు రిజిస్ట్రార్ గురువారం ఉదయం హెచ్ సీయూలో దాదాపుగా ఐదు కిలోమీటర్లు కాలినడకన పర్యటించి మొత్తం వివరాలు సేకరించారు. అంతకు ముందు భారీగా బారికేడ్లతో విద్యార్థులను ఈస్ట్ క్యాంపస్ వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు రిజిస్ట్రార్ రాకతో వాటిని తొలగించారు. జే సీబీ లు సైతం మాయమయ్యాయి. రిజిస్ట్రార్ ను కలిసి విద్యార్థి సంఘాల నాయకులు , ప్రొఫెసర్లు కలిసి మొత్తం ప్రభుత్వం ధ్వంసం చేసిన ప్రదేశాన్ని చూపించారు. రిజిస్ట్రార్ సైతం ఓపికగా అన్ని విషయాలను నోట్ చేసుకున్నారు. రిజిస్ట్రార్ వెళ్లగానే పోలీసులు తిరిగి ప్రదేశాన్ని చుట్టుముట్టి ఎవరిని వెళ్లకుండా అడ్డుకున్నారు. గురువారం హైకోర్టు 7 వ తేదీ వరకు స్టే పొడిగించిన విషయం తెలిసిందే.



## హెచ్ సి యు భూములను కాపాడాలని బిజెపి ప్లకార్డులతో నిరసన

కేపీహెచ్బీ కాలనీ, మనం న్యూస్: హెచ్ సి యు అడవి ప్రాంతాన్ని అన్యాక్రాంతం చేస్తున్న ప్రభుత్వంపై నిరసనగా వివేకానంద నగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు డాక్టర్ యన్.వంశీ రెడ్డి ఆధ్వర్యంలో బిజెపి నేతలు వివేకానంద నగర్ లోని వివేకానంద స్వామి విగ్రహం దగ్గర గురువారం ప్లకార్డుల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తమ భూమిగా వర్ణించుకుంటున్న కంచేనా గచ్చిబౌలి హెచ్.సి.యు ప్రాంతాన్ని నిర్మానుషంగా అందులో ఉన్న జీవరాశులకు నివాసాని కోల్పోయే విధంగా, దేశానికి జాతీయ పక్షి అని చెప్పుకునే మనం ఈరోజు మన రాష్ట్ర ప్రభుత్వం మన జాతీయ పక్షికి మనుగడ లేకుండా పర్యావరణానికి తీవ్ర నష్టాన్ని కలిగించే విధంగా కాంక్రీట్ జంగల్ గా సృష్టించి భవిష్యత్తులో హైదరాబాదుకు తీవ్రమైన ప్రకృతి ప్రకోపానికి గురయ్యే విధంగా చేస్తున్న ఈ కాంగ్రెస్ ప్రభుత్వం తన చర్యలను వెంటనే వెనక్కి తీసుకొని ప్రకృతిని రక్షించాలని వంశీ రెడ్డి హెచ్చరించారు.. ఈ కార్యక్రమానికి పార్టీ సీనియర్ నాయకులు శ్రీహరి యాదవ్, నర్సింగరావు, శంకరన్న, శ్రీనివాస్, గోపాలరావు ,రేపన్ రాజు, భాస్కర్ రెడ్డి ,వేణు ,మమత, జైయశ్రీ, రేణుక, సందీప్, నరేష్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## వాసవి బిజినెస్ గ్రూప్ (వీబిజీ) కో ఫౌండర్గా, గ్లోబల్ ప్రెసిడెంట్గా కొమురవెల్లి మారుతి

రంగారెడ్డి ఏప్రిల్ 3 (మనం న్యూస్) వ్యాపార నెట్వర్కింగ్ గ్రూపు లలో అగ్రగామిగా ఉన్న వాసవి బిజినెస్ గ్రూప్ (వీబిజీ) కో ఫౌండర్ గా, గ్లోబల్ ప్రెసిడెంట్ గా కొమురవెల్లి మారుతిని నియమించారు. గురువారం సికింద్రాబాద్ లోని క్లాసిక్ గార్డెన్ లో జరిగిన విబీజీ ఆరో వార్షికోత్సవం లో ఈమేరకు వీబీజీ ఫౌండర్ టీవీస్ ప్రసాద్ , ఫౌండర్ మడిపడి రాజు ప్రకటించారు. కో ఫౌండర్స్ గ్లోబల్ వైస్ ప్రెసిడెంట్ గా ఊక సతీష్, సెక్రటరీ గా సంతోష్, ట్రెజరర్ గా సుమన్ ను నియమించారు. ఈ సందర్భంగా వీరిని పలువురు అభినందించారు.

# పి.జె.టి.ఎ.యు టైంస్కేలు ఉద్యోగులకి మూడు లక్షల రూపాయల గ్రాట్యుటీ

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి టైం స్కేల్ ఉద్యోగుల పాలాభిషేకం**




రాజేంద్రనగర్, ఏప్రిల్ 3 (మనం న్యూస్): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న టైం స్కేలు ఉద్యోగస్తుల దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న పదవీ విరమణ ప్రయోజనాల అంశం నేటికి ఒక కొలిక్కి వచ్చింది. 2008వ సంవత్సరంలో ఆనాటి ముఖ్యమంత్రి డాక్టర్ వై. ఎస్. రాజశేఖర్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి ఎన్. రఘువీరారెడ్డి కాలంలో విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న వేలాది మంది కాంట్రాక్ట్ వ్యవసాయ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ చారిత్రాత్మక నిర్ణయం తీసుకొన్నారు. ఆనాటి నుండి నేటి వరకు ఉద్యోగ భద్రత తప్ప మిగతా ఎలాంటి ప్రయోజనాలు లేకపోవటం, వాటి పరిష్కారానికి ఎలాంటి ప్రయత్నాలు జరగకపోవటం గమనార్హం. దాదాపు ప్రతి టైం స్కేలు ఉద్యోగి 35-40 సంవత్సరాలు విశ్వవిద్యాలయంలో సేవచేసి పదవీ విరమణ సమయంలో ఎలాంటి ఆర్థిక ప్రయోజనాలు లేక రిక్త హస్తాలతో నేటి వరకు పదవీ విరమణ చేయాల్సి వస్తుంది. ఇదే విషయాన్ని టైంస్కేలు ఉద్యోగస్తులు గత 17 ఏళ్ల నుండి ఎన్నో సార్లు విశ్వవిద్యాలయ యాజమాన్యానికి విన్నవించుకున్నా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది.ప్రస్తుత ఉపకులపతి అల్దాస్ జానయ్య పదవీ బాధ్యతలు తీసుకున్న తర్వాత టైంస్కేలు ఉద్యోగస్తులు అపరిష్కృతంగా ఉన్న ఈ సమస్యను వారి దృష్టికి మరోసారి తీసుకువచ్చారు. విశ్వవిద్యాలయ యాజమాన్యం ఈ విషయాన్ని అధ్యయనం చేసి సానుకూలంగా స్పందిస్తూ గత నెల 25వ తేదీన జరిగిన విశ్వవిద్యాలయ పాలక మండలి సమావేశంలో చర్చించి ఒక నిర్ణయం తీసుకున్నారు. దీని ప్రకారం ప్రతి టైంస్కేలు ఉద్యోగికి పదవీ విరమణ సమయంలో మూడు లక్షల రూపాయల గ్యాట్యుటీ ఇవ్వాలని పాలక మండలి నిర్ణయించినట్లు ఉపకులపతి అల్దాస్ జానయ్య తెలిపారు. గురువారం విశ్వవిద్యాలయానికి సంబంధించిన వివిధ కళాశాలలు, మరియు పరిశోధనా సంస్థలలో పరిచేస్తున్న సుమారు 200 మంది టైంస్కేలు ఉద్యోగులు విశ్వవిద్యాలయ పరిపాలనా భవనం ముందు సమావేసమై విశ్వవిద్యాలయ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఉపకులపతి జానయ్య మాట్లాడుతూ... రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన, ఆలోచన మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభిప్రాయానికి అనుగుణంగా పాలక మండలి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఆనాడు రాజశేఖర్ రెడ్డి వ్యవసాయ శాఖామాత్యులు రఘువీరారెడ్డి గారు వేలాది మంది వ్యవసాయ కాంట్రాక్ ఉద్యోగులకు 2008 సంవత్సరం లో ఉద్యోగ భద్రత కల్పించగా నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు అభిప్రాయం మేరకు ఉద్యోగ విరమణ ప్రయోజనమైన మూడు లక్షల రూపాయిల గ్రాట్యుటీ కల్పిస్తూ విశ్వవిద్యాలయం తీసుకున్న నిర్ణయాన్ని టైం స్కేల్ ఉద్యోగులు హర్షిస్తు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు.

# 'సీ' ఆధ్వర్యంలో శ్రీ సీతరామ కళ్యాణం, ఉగాది పురస్కారాలు

**వివిధ రంగాలలో అత్యుత్తమ సేవలు అందిస్తున్న ప్రముఖ వ్యక్తులకు సన్మానం టీపీసీసీ అధికార ప్రతినిధి, 'సీ' జాతీయ అధ్యక్షులు డా. సత్యం శ్రీరంగం**



కేపీహెచ్బి, మనం న్యూస్: సనాతన ఎంటర్ప్రెన్యూర్స్ అసోసియేషన్ 'సీ' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ విశ్వావసు నామ ఉగాది పురస్కారాల 2025 ప్రధానోత్సవ బ్రోచర్ను టీపీసీసీ అధికార ప్రతినిధి, 'సీ' జాతీయ అధ్యక్షులు డా. సత్యం శ్రీరంగం ఇందుమతి శ్రీరంగం దంపతులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్యంశ్రీరంగం మాట్లాడుతూ ఈ నెల 5న ఉప్పల్ భాగయత్ లోని శ్రీరస్తు కన్వెన్షన్ లో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతీ స్వామీజీ వారి మంగళ శాసనాలతో స్వామి వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో శ్రీ సీతారామ స్వామి కల్యాణ మహోత్సవం జరుగుతుందని తెలిపారు. అనంతరం శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పంచాంగ శ్రవణం జరుగుతుందని అన్నారు. అదేవిధంగా ఉగాది వేడుకల సంబరాలు పురస్కరించుకొని బ్రాహ్మణ సమాజానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్తలు, సామాజిక కార్యకర్తలు, డాక్టర్లు, ఇంజనీర్లు ఇతర రంగాలలో విజయం సాధించిన ప్రముఖ వ్యక్తులను సన్మానించనున్నారు వివరించారు. ఈ కార్యక్రమానికి బ్రాహ్మణ సోదరీసోదరమణులందరు పెద్ద ఎత్తున హాజరై ఉగాది పురస్కారాలు జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉగాది పురస్కారల కన్వీనర్ ఆర్ సి మూర్తి, సీ వ్యవస్థాపకులు ముళ్లపూడి అమ్రిత్, సీ తెలంగాణ అధ్యక్షులు సాయి ప్రసాద్, సమన్వయకర్త శరన్ కండల, జాతీయ ప్రధానకార్యదర్శి శ్రీనివాస్ పీసపాటి, శ్రీరంగం ఫౌండేషన్ కో- చైర్పర్సన్ శ్రీమతి ఇందుమతి శ్రీరంగం, మహిళా విభాగం కార్యదర్శి శిరీష పుల్లే, రాజ్య లక్ష్మియువజన విభాగంప్రధాన కార్యదర్శి గౌతమ్ వలివేటి, శశి హరి, పవన్, లక్ష్మి మోహన్ తదితలులు పాల్గొన్నారు.






# శ్రీరామనవమి వేడుకల ఏర్పాట్లపై ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సమావేశం

కేపీహెచ్బీ కాలనీ,మనం న్యూస్; ఈనెల 6 వతేదీన శ్రీరామనవమి సందర్భంగా కూకట్పల్లి రామాలయంలో శ్రీరామనవమి ఏర్పాట్లపై ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ అన్ని విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ శాంతిభద్రతల విషయంలో,ట్రాఫిక్కు అంతరాయం కలగకుండా ఎక్కడికిఅక్కడ సూచి బోర్డులు ఏర్పాటు చేసి ప్రజలకు ముందే తెలిపే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. శానిటేషన్ విషయంలో, వేసవి తాపం పెరిగిన కారణంగా మంచినీరు ప్రతి ఒక్కరికీ అందేటట్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే నాలుగవ తేదీ నుంచి ఆలయాన్ని విద్యుత్ దీప అలంకరణతో అత్యంత సుందరంగా తీర్చిదిద్దాలని తగిన ఏర్పాట్లు చేయాలని ఆలయ ఈవో ,చైర్మన్ లకు సూచించారు. వచ్చిన భక్తులకు భోజన ఏర్పాట్లు, ప్రసాదం అందేలా చూడాలన్నారు. ఎంతమంది వచ్చినా ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు చేశారు. 436 ఏళ్ల చరిత్ర గల ఈ కూకట్పల్లి రామాలయంలో శ్రీరామనవమి వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహిస్తారని, భక్తులందరూ కూడా ఈ వేడుకలకు విచ్చేసి ఆ సీతారామ చంద్రుల కృపకు పాత్రులు కాగలరని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, మాధవరం రోజా దేవి రంగారావు, మాజీ కార్పొరేటర్లు మాధవరం రంగారావు , పగుడాల బాబురావు, చైర్మన్ తులసిరావు ఆలయ ఈవో ఆంజనేయులు ఆలయ స్తపతి వల్లి నాయకం, కూకట్పల్లి శివాలయం మాజీ చైర్మన్ సూర్యారావు, ఆలయ సిబ్బంది శానిటేషన్ శాంతిభద్రతలు ట్రాఫిక్, జిహెచ్ఎంసి, వాటర్ వరక్స్ అధికారులు ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



**తెలంగాణ ప్రభుత్వం నూతనంగా పంపిణీ చేస్తున్న సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్ కుమార్, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ కూకట్పల్లిలోని పౌరసరఫరాల శాఖ పంపిణీ కేంద్రంలో లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేశారు.**

**కేపీహెచ్బీ కాలనీ, మనం న్యూస్**

# జగపాల్ రెడ్డి స్మారకార్థం ఉచిత కంటి పరీక్షలు

**ఉచిత కంటి పరీక్షలు ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలి**

**ముఖ్య అతిథులుగా హాజరైన లట్టుపల్లి సుధారాణి దేవి, సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**







(మనం ఏప్రిల్03/తలకొండపల్లి) : రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల పరిధిలోని దేవుని పడకల్ గ్రామంలోని అవేర్ హాస్పిటల్ ప్రాంగణంలో గురువారం కీర్తిశేషులు జగపాల్ రెడ్డి స్మారకార్థం వారి తనయుడు ఎన్నారా కృష్ణదేవ రెడ్డి పేదల కంటి చూపు మెరుగుపరిచే దిశగా ఉచిత సేవలు అందిస్తూ పది రోజులపాటు దేవుని పడకల్ గ్రామంలో కంటి పరీక్షలు నిర్వహించి ఆపరేషన్ చేసి కంటి అద్దాలు సమకూర్చే దిశగా కంటి పొరతో బాధపడుతున్న పేదలకు కీర్తిశేషులు జగపాల్ రెడ్డి స్మారకార్థం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు పంపిణీ చేస్తున్నట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు.గురువారం పడకల్ గ్రామంలోని అవేర్ ఆస్పత్రి ఆవరణంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి ముఖ్య అతిథులుగా లట్టుపల్లి సుధారాణి దేవి, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి హాజరై వారు మాట్లాడుతూ ప్రజలందరూ ముఖ్యంగా గ్రామీణ ప్రజలందరూ ఉచిత కంటి పరీక్షలు నిర్వహించుకుని వారికి సరైన సదుపాయం కల్పిస్తూ శంకర నేత్రాలయ సంస్థ అధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించి పేదలకు కంటి చూపు అందించే దిశగా కీర్తిశేషులు జగపాల్ రెడ్డి కుటుంబ సభ్యులు పేదల కోసం సేవలు అందిస్తున్నారని వారు పేర్కొన్నారు .దేవుని పడకల్ గ్రామంలో అవేర్ సంస్థకు కీర్తిశేషులు జగపాల్ రెడ్డి తమ భూమిని సైతం పేదలకు ఉచితంగా అందించినట్లు వారు తెలిపారు. గ్రామీణ ప్రజలందరూ ఇలాంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కండెమోని శ్రీశైలం,లట్టుపల్లి సుధామణి దేవి,శశిపాల్ రెడ్డి,నందినీ రెడ్డి, అనురాధ రెడ్డి ,భారతీదేవి మధుసూదన్ రెడ్డి ,సురేందర్ రెడ్డి, లోక్పాల్ రెడ్డి ,రాజ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా ప్రముఖులతో వినియోగదారుల అనుబంధం




జూబ్లీహిల్స్, మనం న్యూస్: వినియోగదారుల ప్రయాణంలో బ్రాండ్ అంబాసిడర్లను భాగం చేయడం అనేది ప్రేక్షకులతో బలమైన అనుబంధాన్ని ఏర్పరచుకోవడానికి ఒక శక్తివంతమైన మార్గం అని ప్రముఖ ఆన్లైన్ గేమింగ్ సంస్థ పారిమ్యాచ్ పేర్కొంది. ఈ విషయమై సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ ఐగేమింగ్ రంగంలో ప్రముఖ క్రీడాకారులను బ్రాండ్ అంబాసిడర్లుగా నియమించడం ద్వారా తమ లాంటి సంస్థలు బ్రాండ్ గుర్తింపును పెంచుకోవడమే కాకుండా, అభిమానులను వారికిష్టమైన క్రీడలు, ఆటగాళ్లకు మరింత చేరువ చేస్తున్నాయన్నారు. గ్లోబల్ గేమింగ్ ప్లాట్ఫామ్ అయిన పారిమ్యాచ్, క్రికెట్ సంచలనం నికోలస్ పూరన్, మిస్టరీ బౌలర్ సునీల్ నరైన్లతో భాగస్వామ్యం కుదుర్చుకోవడం ద్వారా ఈ విధానానికి ప్రాణం పోసిందన్నారు. ఈ సహకారాలు కేవలం ప్రచారానికి మాత్రమే పరిమితం కాకుండా, గేమ్ప్లే, పోటీ అనుభవాలలోనూ విస్తరించాయని వెల్లడించారు. యాప్ వినియోగదారులు నియమ నిబంధనలను అనుసరించి సొంత రిస్క్ పై ఆన్లైన్ గేమింగ్ ఆడాలని సూచించారు.



**ఎన్టీఆర్ లిట్రెచర్ కమిటీ చైర్మన్, పొలిట్ బ్యూరో మెంబెర్ టిడి జనార్ధన్ పుట్టినరోజు సందర్భంగా గురువారం కొడాలి రవి జనార్ధన్ను శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.**

**-కేపీహెచ్బీ కాలనీ, మనం న్యూస్**

## ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా నిపుణుల సూచనలు



పంజాగుట్ట, మనం న్యూస్: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం (ఏప్రిల్ 7) సమీపిస్తున్న వేళ మంచి ఆరోగ్యం కేవలం ఎక్కువ కాలం జీవించడమే కాకుండా, ఆరోగ్యకరమైన, మెరుగైన జీవితాన్ని గడపడం అని దాని ప్రాముఖ్యతను నిపుణులు గుర్తు చేస్తున్నారు. సమతుల్య ఆహారం ఆరోగ్యానికి మూలాధారమని, బాదం వంటి పోషకాలు అధికంగా ఉండే ఆహారాలను రోజువారీ భోజనంలో చేర్చుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చని వారు సూచిస్తున్నారు. కాలిఫోర్నియా బాదంపప్పులు ప్రోటీన్, ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులు, మెగ్నీషియం, జింక్, విటమిన్-ఈ వంటి 15 ముఖ్యమైన పోషకాల సహజ వనరు అని అంటున్నారు. ఇవి ఆరోగ్యకరమైన జీవనశైలికి ఎంతో దోహదపడ తాయని వారు పేర్కొంటున్నారు. తరతరాలుగా బాదం ప్రాముఖ్యతను మన పెద్దలు చెప్పగా, దాదాపు 200 పరిశోధనా అధ్యయనాలు బాదం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను ధృవీకరించా యంటున్నారు. ఇవి శక్తిని, రోగనిరోధక శక్తిని పెంచడంతో పాటు గుండె ఆరోగ్యం, రక్తంలో చక్కెర స్థాయిలు మరియు బరువు నిర్వహణకు కూడా సహాయపడతాయని నిపుణులు చెబుతున్నా రు. న్యూఢిల్లీలోని మాక్స్ హెల్త్కేర్ డైటెటిక్స్ రీజినల్ హెడ్ రితికా సమద్దర్ మాట్లాడుతూ ఆహారపు అలవాట్లలో మార్పులు, నిశ్చల జీవనశైలి కారణంగా భారతదేశంలో ఊబకాయం, హృదయ సంబంధ వ్యాధులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పోషకాహారం మంచి ఆరోగ్యానికి పునాది అని, బాదం వంటి పోషకాలు అధికంగా ఉండే ఆహారాలను తీసుకోవడం చాలా ముఖ్యమని ఆమె సూచించారు. న్యూట్రిషన్ కన్సల్టెంట్ షీలా కృష్ణ స్వామి మాట్లాడుతూ ఊబకాయం సంక్షోభా న్ని పరిష్కరించడానికి పోషకాలు అధికంగా ఉండే ఆహారం తీసుకోవడం అవసరమని, బాదం బరువు నిర్వహణకు, ఆరోగ్యకరమైన చిరుతిండిగా ఉపయోగపడుతుందని తెలిపారు. డాక్టర్ రోహిణి పాటిల్ మాట్లాడుతూ జీవనశైలి సంబంధిత వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యమన్నారు. బాదం రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుందని వివరించారు. బాలీవుడ్ నటి సోహా అలీ ఖాన్, దక్షిణ భారత నటి శ్రియ శరణ్ కూడా తమ ఆరోగ్యకరమైన జీవనశైలిలో బాదం ఒక ముఖ్యమైన భాగమని పేర్కొన్నారు.

## అక్రమంగా మట్టి తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు



(మనం ఏప్రిల్03/తలకొండపల్లి): అక్రమంగా మట్టి తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసిన ఎస్సై శ్రీకాంత్ తలకొండపల్లి మండల పరిధిలోని పడకల్ గ్రామ శివారులో వీరన్న కుంటలో గురువారం అక్రమంగా మట్టి తరలిస్తున్నారని తలకొండపల్లి మండల తాసిల్దార్ కి సమాచారం రాగా వెంటనే మండల రెవెన్యూ గిర్ధవరు, సిబ్బంది సంఘటన స్థలానికి వెళ్లి చూడగా అక్కడ రెండు టిప్పర్లు ఒక హిటాచి సహాయంతో మట్టిని తొవ్వుతున్నారు.మట్టిని తవ్వించిన పాండురంగారెడ్డి పై గిర్ధవరు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్లు తదితర హిటాచిని సీజ్ చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఏ. శ్రీకాంత్ తెలిపారు.